క్లుప్తంగా

పోలీసు రక్షణ లేకుండా చంద్రబాబు తిరగగలరా?

ఎమ్మెల్సీ జయమంగళ



కైకలూరు : పోలీసులపై దాడి చేస్తున్న చంద్రబాబు వైఖరిని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తీవ్రంగా ఖండించారు. పోలీసు రక్షణ లేకుండా చంద్రబాబు రాష్ట్రంలో ఒక్కరోజైనా తిరగగలరా అని ప్రశ్నించారు. పుంగనూరులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, పోలీసులపై దాడులు, వాహనాలను తగలబెట్టడం వంటి ఘటనలపై ఆయన కార్యాలయంలో శనివారం మాట్లాడారు. రూట్‌మ్యాప్ మార్చి కావాలనే చంద్రబాబు గొడవలు సృష్టించారన్నారు. కర్రలు, కత్తులతో దేనికైనా రెడీ అంటూ రెచ్చగొట్టటం సీనియర్ రాజకీయ నాయకుడికి తగదన్నారు. గొడవలు జరుగుతున్న సమయంలో అంబులెన్సులో చిన్నారి ఉందన్నారు. ఆమెకు ఏదైనా ప్రమాదం జరిగి ఉంటే దానికి చంద్రబాబు బాధ్యత వహించాల్సి వచ్చేదన్నారు. ఇప్పటికైన రౌడీ రాజకీయాలు మానాలని హితవు పలికారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

పెదపారుపూడి: మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ మందులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోగం సురేష్ మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత వస్తుందన్నారు. విద్యార్థులు అందరికీ ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న నులిపురుగుల నివారణ మందులను అందించాలని పీహెచ్‌సీ వైద్యులకు, పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీ.సీతామహాలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యులు, హెచ్‌ఎం పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: ఈ నెల 10న జరిగే నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని విజయవంతం చేయాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం శనివారం జరిగింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులతో నులిపురుగుల మాత్రలు మింగించాలని రాజామణి చెప్పారు. మాత్రలను ఎంఈఓ జి.వెంకటేశ్వరరావుకు ఆమె అందజేశారు. ఒకటి నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సున్న బాల, బాలికలతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సీహెచ్ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ మాణిక్యం పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

మండవల్లి : పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పారు. అనంతరం ఎంపీపీ పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాను న్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, వైస్ ఎంపీపీ అగస్తీ ఆదివిష్ణు, ఎంపీడీఓ సీకే వెంకటరమణ, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఏఓ జె.శ్రీనివాస్, సర్పంచ్ మెండా ఝాన్సి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

ముదినేపల్లి రూరల్ : యువకుల మధ్య స్నేహభావం పెరగడానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. పెయ్యేరు వైఎస్సార్ కాలనీ యువకులకు వాలీబాల్ క్రీడా కిట్లను ముదినేపల్లి శనివారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యంగా ఉండేందుకు సహకరిస్తాయన్నా రు. పెయ్యేరు వైస్ సర్పంచ్ దివి సతీష్, నా యకులు, సాయిబాబు, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

మండవల్లి : మండలంలోని గన్నవరం గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ ప్ర గ్రామ సభల్లో ఎక్కువగా పాల్గొని గ్రామాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలను తీసుకుంటేనే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఐసీడీఎస్ సీడీపీవో విజయఫ్లోరెన్స్

గుడివాడరూరల్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ గుడివాడ ప్రాజెక్టు సీడీపీవో విజయ ఫ్లోరెన్స్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బిళ్లపాడు సచివాలయం వద్ద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత బాలింతలు, గర్భిణులు 29 మందికి వైఎస్సార్ పోషణ కిట్లను అందజేశారు. ఈ కిట్లలో 3కిలోల బియ్యం, కేజీ పప్పు, 500 గ్రాముల ఆయిల్, 25 కోడిగుడ్లు, ఐదులీటర్ల పాలతో పాటు మరో ఐదు రకాలు కలిపి మొత్తం 10 రకాల పోషకాహారాన్ని కిట్ల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వం అందచేస్తున్న పోషక ఆహారంలో ఉన్న పోషకాల గురించి వివరించాలని ఆదేశించారు. ఈ పోషక ఆహారాన్ని బాలింతలు, గర్భవతులు తప్పనిసరిగా తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని స్పష్టం చేశారు. మండల సచివాలయాల కన్వీనర్ కారే జోసఫ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చుక్కా నాగలక్ష్మి, సూపర్‌వైజర్ అరుణకుమారి, ఎంఎస్‌కే రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, రేవతి, పద్మ, సుభాషిణి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



బిళ్లపాడులో కిట్లు అందజేస్తున్న సీడీపీవో విజయఫ్లోరెన్స్, ప్రజాప్రతినిధులు

పమిడిముక్కల: ముళ్లపూడి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా టేక్ హోమ్ రేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ప్రేమలత, ఏఎన్‌ఎం ప్రభావతి పాల్గొన్నారు.

భట్లపెనుమర్రు(మొవ్వ): ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సక్రమంగా వినియోగించుకుని బలహీనత, రక్తహీనతలను దూరం చేసుకోవాలని ఎంపీపీ కొండేటి ఇందిర సూచించారు. భట్లపెనుమర్రులోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన టేక్ హోమ్ రేషన్ కిట్లను ఎంపీపీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్యకర్తలు పీ భసవపూర్ణ, కే ప్రమీలారాణి, కే అర్జున కుమారి, కే సుజాత, హెల్పర్లు ఎం.ఏడుకొండలు, కే అరుణకుమారి, పీ నాగమణి, కే సుభాషిణి పాల్గొన్నారు.



భట్లపెనుమర్రులో కిట్లను అందిస్తున్న మొవ్వ ఎంపీపీ ఇందిర

ముదినేపల్లి రూరల్ : మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ అన్నారు. పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులైన మహిళలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పూర్తి ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు మరింత ఆరోగ్యంగా ఉంటారన్నారు. వీరిలో పోషకాహార లోపం తలెత్తకుండా ఉండడం కోసం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ముఖ్యమంత్రి జగనన్న ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఎంపీటీసీ జంపాన కోటయ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.28.10 కోట్లు

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పామర్రు: నియోజ కవర్గంలోని పలు రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. యలమర్రు గ్రామం నుంచి దోసపాడు గ్రామ వరకు 13.8 కిలో మీటర్ల రహదారికి రూ.6.60 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. పెదపారుపూడి గ్రామం నుంచి పామర్రు గ్రామం వరకు రూ.3.50 కోట్లు నిధులు మంజూరైనట్టు చెప్పారు. గుడివాడ, చల్లపల్లి, కొత్తపాలెం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు శాంక్షన్ అయ్యాయన్నారు. కొతవరం, నిడుమోలు, ఐలూరు గ్రామం వరకు రోడ్డు అభివృద్ధికి రూ.5 కోట్లు నిధులు మంజూరైనట్టు వివరించారు.

రూ.90 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల గ్రామంలోనే సుమారు రూ.90 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మండలంలోని వానపాముల గ్రామంలో సుమారు రూ. 40 లక్షలతో పూర్తి చేసిన సచివాలయ భవనాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామంలో పూర్తి చేసిన సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్‌ను పరిశీలించామన్నారు. ఆర్‌బీకే కేంద్రం పనులు చివరి దశకు చేరుకుటున్నట్లు పేర్కొన్నారు. ఈనెల చివరి కల్లా సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. గ్రామ సర్పంచ్ పాతూరి రమేష్, వీఆర్వో దానియేలు, వైఎస్సార్ సీపీ నాయకులు నమా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోనూ పరిశీలన



సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ గోగం సురేష్, సర్పంచ్ రమేష్

మండలంలోని వానపాముల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ గోగం సురేష్ పరిశీలించారు. మోనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని పిల్లలకు అందించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండల సానారుద్రవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కేటాయించిన నిధులు రూ.10 లక్షలు, ఇతర నిధులు రూ.5 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లను శనివారం ఆయన ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలనలో ఎప్పుడూ జరగని అభివృద్ధి కార్యక్రమాలు కైకలూరు నియోజకవర్గంలో జరిగాయన్నారు. దశలవారీగా పూర్తిస్థాయిలో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. పీఏసీఎస్ అధ్యక్షులు వడ్లాని పార్థసారథి, మాజీ ఏఎంసీ అధ్యక్షులు నీలపాల వెంకటేశ్వరరావు, పాతాళ భోగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త చిట్టూరి బుజ్జి, నున్న కృష్ణబాబు, విన్నకోట వెంకట సుబ్బారావు, దొడ్డాకుల పండు, విన్నకోట సోమేశ్వరరావు, వడ్లాని శేఖర్ బాబు, గంధం రామకృష్ణ, పాశం దొరబాబు, మారుబోయిన పెద గంగరాజు, చన్నంశెట్టి కోదండరామయ్య, మారుబోయిన కృష్ణ, మారుబోయిన వెంకన్న, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.



సానారుద్రవరంలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

పవన్ కల్యాణ్‌కు ఇంటిలిజెన్స్ సమాచారం ఇవ్వలేదు

మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్ పీవీఎన్ మాధవ్

గుడివాడ టౌన్: వార్డు, గ్రామ వలంటీర్లు మహిళలను ట్రాఫికింగ్ చేస్తున్నట్లు జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలు తన సొంత అభిప్రాయమని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్ పీవీఎన్ మాధవ్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం ఈనెల 10వ తేదీ నిర్వహించనున్న కలెక్టర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమంపై కార్యకర్తలను సమన్వయం చేసేందుకు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఏ ఒక్క ఇంటిలిజెన్స్ అధికారి ఆయనకు ట్రాఫికింగ్‌పై సమాచారం ఇవ్వలేదన్నారు. ఆయన వద్ద ఉన్న సమాచారాన్ని బట్టి చెప్పి ఉంటారని తెలిపారు. తెలుగుదేశంతో కలిసి పోటీచేస్తారా అనే ప్రశ్నకు అది అధిష్టాన నిర్ణయమని అందుకు నేను సమాధానం ఇవ్వలేనన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామినేని వెంకట కృష్ణ, బోగాది రమాదేవి, యు.కపర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూరే గాంధి, పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్, జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్, పలువురు బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధవ్, తదితరులు

ఆసుపత్రిని పరిశీలించిన న్యాయమూర్తి

గుడివాడ టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్‌జడ్జి ఎ.పూర్ణిమ శనివారం పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ అన్నారు. మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు, వసతులు, రోగుల అభిప్రాయాలు తెలుసుకునే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పూర్ణిమ మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వసతులు అద్భుతంగా ఉన్నాయన్నారు. వైద్య సేవలు సైతం సంతృప్తికరంగా అందుతున్నట్లు గమనించామన్నారు. ఆపరేషన్ థియేటర్, బ్లడ్‌బ్యాంక్, చిన్నపిల్లల విభాగం తదితర విభాగాలను పరిశీలించామని, రోగులతో కూడా మాట్లాడామన్నారు. ఎవరి వద్ద నుంచి ఫిర్యాదులు అందలేదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి, ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, న్యాయవాదులు సీహెచ్ కుటుంబరావు, శివరామకృష్ణ, విమలాదేవి, వెంకట రమణ, పారా లీగల్ వలంటీరు ఎస్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న న్యాయమూర్తి పూర్ణిమ

సత్యప్రసాద్ సేవలు ఆదర్శనీయం

పమిడిముక్కల: కమ్యూనిస్టు నేత కామ్రేడ్ ద్రోణవల్లి సత్యప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వీరంకిలాకు జీసస్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ గద్దే తారలీల పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీకి సత్యప్రసాద్ అందించిన సేవలను కొనియాడారు. మామిళ్లపల్లిలోని సత్యప్రసాద్ స్మారక స్థూపం వద్ద సత్యప్రసాద్ 61వ వర్థంతిని శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, సత్యప్రసాద్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గొట్టిపాటి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు గొట్టిపాటి సత్యప్రసాద్, ద్రోణవల్లి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

1400 నోటు పుస్తకాల పంపిణీ

తోట్లవల్లూరు: ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారం వినియోగించుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలని ఎంఈవో జి.వెంకటేశ్వరరావు తెలిపారు. రెబ్బా చందర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ శనివారం జరిగింది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికీ రెండు పుస్తకాల చొప్పున 32 పాఠశాలల్లో 1400 పుస్తకాలను వెంకటేశ్వరరావు, ఫౌండేషన్ చైర్మన్ రెబ్బా అంబేద్కర్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

మహిళల రక్షణపై సదస్సు

గుడివాడ టౌన్: మహిళలపై జరుగుతున్న దాడులు వారి రక్షణ విషయంలో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.పూర్ణ అన్నారు. శనివారం స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఐద్వా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కృష్ణాజిల్లా కార్యదర్శి జ్యోతి, వై.సత్యవతి, సీహెచ్ రమణి, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, విజయ, సుజాత, కోశాధికారి వీరమ్మ పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం

కాజ(మొవ్వ): విద్యార్థులను క్రమశిక్షణలో ఉన్నతులుగా తీర్చి దిద్దడంలో బండి రమాదేవి చేసిన కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కాజ గ్రామంలోని శ్రీ పేకేటి నర్సారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన రమాదేవి, వెంకటేశ్వరరావు దంపతులను శనివారం ఘనంగా సత్కరించారు. సభకు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎంఎస్ఆర్ లక్ష్మి అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీకి మైనారిటీ నేత సాహెబ్ గుడ్‌బై

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో టీడీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాస్ (రాజా) టీడీపీకి రాజీనామా చేసిన విషయం విదితమే. అదే బాటలో మండల మైనారిటీ సెల్ ప్రధానకార్యదర్శి మహ్మద్ సాహెబ్ (అక్బర్) తన పదవికి, టీడీపీ సభ్యత్వానికి శనివారం రాజీనామా చేశారు. చింతా రాజాకు మద్దతుగా రాజీనామా చేస్తున్నట్లు సాహెబ్ తెలిపారు. పార్టీలో నిజాయితీ పరులకు విలువ లేదని, స్వార్థపరులు ఎక్కువయ్యారని అన్నారు. విలువ లేని చోట ఉండటం ఇష్టం లేక పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం

గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో శనివారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా పీవీ శేషగిరిరావు, కార్యదర్శిగా సీతాల ప్రసాదు, కోశాధికారి వి.రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా వి.బాబూరావు, సహాయ కార్యదర్శి టి.గోపాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు జి.కనకారావు, ఎంఎన్‌టీ శాస్త్రి, జి.సత్యన్నారాయణ, పి. శ్రీనివాసరావులు ప్రమాణస్వీకారం చేశారు.

శాంతిభద్రతలు కాపాడాలి

కైకలూరు : అంకితభావంతో పనిచేస్తూ శాంతి భద్రతలను కాపాడాలని నూతన సీఐ కృష్ణకుమార్‌కు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సూచించారు. కైకలూరు రూరల్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.కృష్ణకుమార్ శనివారం ఎమ్మెల్సీ జయమంగళను ఆయన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను బహుమతిగా అందించారు. కొల్లేరు, ఇతర గ్రామాలపై చర్చించుకున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

మండవల్లి : యువతి అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కై కలూరు మండలం ఆటపాక గ్రామానికి చెందిన ప్రభు కుమార్ తన సోదరిని వాళ్ల మేనత్త గ్రామమైన మండవల్లి మండలం లెళ్లపూడి గ్రామం పంపించారు. కాగా ఈ నెల 2వ తేదీ రాత్రి 12.30 గంటల నుంచి ఆమె కనిపించకపోవడంతో ఆమె అన్నయ్యకు ఫోన్ చేసి విషయం చెప్పారు. అయితే ఆ యువతిని వాసుపల్లి రాజు అనే వ్యక్తి తీసుకువెళ్లినట్లు అతని స్నేహితులు చెప్పడంతో ప్రభు కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసులో వ్యక్తికి రిమాండ్

మండవల్లి : కిడ్నాప్ కేసులో ఓ వ్యక్తికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఐదురోజుల క్రితం కానుకొల్లు గ్రామానికి చెందిన యువతిని, లంకల కలవగుంట గ్రామానికి చెందిన గోపి తీసుకువెళ్లడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వీరిరువురి ఆచూకి తెలుసుకుని యువతిని వారి తల్లిదండ్రులకు అప్పగించి, గోపిపై పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు చేశారు. కై కలూరు కోర్టు అతడికి శనివారం రిమాండ్ విధించింది.

కుల ధ్రువీకరణ పత్రాలు అందజేత

గుడివాడ టౌన్(నందివాడ): పేద ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నందివాడ మండలం పోలుకొండ గ్రామంలో శనివారం కొండదొర సమాజిక వర్గానికి చెందిన 40 మందికి షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిన్న చిన్న సాంకేతిక ఇబ్బందుల వలన అనేక ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్న లబ్ధిదారుల సమస్యలు దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నవారికి కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. గత 30 సంవత్సరాలుగా ఇదే గ్రామంలో నివాసం ఉంటున్న కొండదొర సామాజిక వర్గం వారికి ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో వారు అనేక ప్రభుత్వ ఫలాలు పొందలేక పోతున్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ అధికారుల ద్వారా సర్టిఫికెట్‌లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.భవన్నారాయణ, ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, కందుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

80 మందికి కంటి పరీక్షలు

నిడుమోలు(మొవ్వ): మండలంలోని నిడుమోలు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన షణ్ముఖ ఐ కేర్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కూచిపూడి ఎస్ఐ డీ సందీప్ ప్రారంభించిన ఈ శిబిరం ద్వారా డాక్టర్ ఏ శ్రీనివాసరావు సుమారు 80 మందికి వైద్యసేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తక్కువ ధరకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి ఇంటేటి జార్జ్ ముల్లర్, ఇంటేటి ప్రసన్న సహకరించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

పామర్రు: మహిళలు అందరూ ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో పలు సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహిస్తున్నామని పామర్రు లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ కూనపరెడ్డి చంద్రశేఖర్‌రావు అన్నారు. స్థానిక చల్లపల్లి రోడ్డులోని లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ పామర్రు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రానికి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. సుమారు 170 మంది మహిళలు ఎంతో ఆసక్తిగా ఈ శిక్షణకు హాజరవుతున్నారని అన్నారు. మహిళలు సమాజంతో తమ కాళ్ల మీద తాము నిలబడేలా లయన్స్ క్లబ్ ప్రోత్సహించడంఅభినందనీయమన్నారు. ఈనెల 14న అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. లయన్ బైసాని నాగేశ్వరరావు, లంకపల్లి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని మెకానిక్ మృతి

కైకలూరు : టిప్పర్ ఢీకొని ఓ మోటార్ సైక్లిస్ట్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కైకలూరు మండలం ఆటపాక శివారు నాగాపురం వద్ద శనివారం జరిగింది. టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ళ మండలం బొండాడకు చెందిన గుండాబోయిన శ్రీనివాసరావు(50) చికెన్ దుకాణాల్లో కోళ్లను శుభ్రం చేయడానికి ఉపయోగించే మిషన్లు రిపేర్లు చేస్తుంటాడు. ఈ క్రమంలో కైకలూరు వస్తుండగా ఆటపాక శివారు నాగాపురం వద్ద టిప్పర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు సంతానం. మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ ఆకుల రఘు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వైభవంగా సుందరాకాండ పారాయణం

గుడివాడరూరల్: మండలంలోని చిన ఎరుకపాడు గ్రామంలో శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం శ్రీమరకత కార్యసిద్ధి హనుమాన్ సన్నిధిలో అఖండ సుందరాకాండ పారాయణం, హోమ పూజలను వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం సుర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అఖండ సుందరాకాండ పారాయణ సహిత, హోమ పూజలు నిర్వహించినట్లు దేవస్థాన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ట్రస్టీ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు పర్యవేక్షించారు.